క్లుప్తంగా

నేడు నీటి సరఫరాలో అంతరాయం

సూర్యాపేట : పట్టణానికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌లో మరమ్మతుల కారణంగా నేడు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తిరుమలగిరి : కాంగ్రెస్ వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12వేల పింఛన్ అందజేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు పేర్ల నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరిప్రసాద్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కన్వీనర్ గొడ్డలి నర్సయ్య, కందుకూరి కొండయ్య, కందుకూరి రమేష్, రాజ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సామేల్‌కు ఆహ్వానం

అర్వపల్లి : అర్వపల్లి శివారులోని హజ్రత్ ఖాజా నసీరుద్దీన్‌బాబా దర్గా ఉర్సులో భాగంగా ఈనెల 29న గంధం ఊరేగింపును నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మందుల సామేల్‌ను దర్గా నిర్వాహకుడు మహ్మద్ హుస్సేన్ కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కలిసిన వారిలో సోమయ్య, రామ్మూర్తి తదితరులు ఉన్నారు.

పాఠశాలలో తాగునీరు ఏర్పాటు



పాఠశాలలో తాగునీటి నల్లాలు ఏర్పాటు చేసిన దాతలు

పెన్‌పహాడ్ : మండలంలోని దోసపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం దాతలు పాఠశాల హెచ్‌ఎం నర్సయ్య, ఉపాధ్యాయులు మామిడి వెంకటయ్య, ఆర్.వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి జానయ్య, మెకానిక్ కొండేటి శ్రీనివాస్‌లు రూ.5వేలతో పాఠశాలకు మిషన్ భగీరథ పైప్‌లైన్ వేసి నల్లాలు ఏర్పాటు చేసి మంచినీటి సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయకుమారి, వెంకన్న, విప్లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



సామూహిక వత్రంలో కూర్చున్న మహిళలు

అర్వపల్లి : కార్తీకమాస బహుళద్వాదశి సందర్భంగా అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో బుధవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేషాభిషేకాలు, తులసి అర్చన, ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో అర్చకులు రాంబాబుఅయ్యంగార్, చక్రవర్తిరామకృష్ణ, పవన్‌కుమార్, ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సీహెచ్.నర్సింహరాజు, కొత్త సంతోష్‌రెడ్డి, ఈగ వెంకటేశ్వర్లు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఉర్సు ఏర్పాట్ల పరిశీలన

అర్వపల్లి : అర్వపల్లి శివారులోని హజ్రత్ ఖాజానసీరుద్దీన్‌బాబా దర్గా ఉర్సు ఈనెల 29, 30తేదీల్లో నిర్వహించనున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను బుధవారం ఎస్‌ఐ సీహెచ్.బాలకృష్ణ పరిశీలించారు. వాహనాల పార్కింగ్ కోసం దర్గా సమీపంలో డోజర్‌తో స్థలాన్ని చదును చేయించారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణకు స్టాపర్లు, దర్గా వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఆయన వెంట సిబ్బంది శ్రీను, అశోక్, దర్గా నిర్వాహకులు ఉన్నారు.

డీఈఓపై చర్య తీసుకోవాలి

అర్వపల్లి : విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అసభ్యకరంగా మాట్లాడుతున్న డీఈఓ అశోక్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించలేదన్నారు. కలెక్టర్ చర్య తీసుకోకపోతే ఉద్యమిస్తామన్నారు.

గతుకుల రోడ్డుపై ప్రయాణం ఎలా?



పస్తాల కల్వర్టు వద్ద గుంతలు పడి తేలిన కంకర



పస్తాల-గుండెపురి మధ్య దెబ్బతిన్న రోడ్డు

- దెబ్బతిన్న పస్తాల- లక్ష్మాపురం రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

నాగారం : మండల పరిధిలోని పస్తాల- లక్ష్మాపురం గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని అస్తవ్యస్తంగా మారింది. లక్ష్మాపురం-కాశీతండా మధ్య, పస్తాల స్టేజీ నుంచి గుండెపురి వరకు బీటీ రోడ్డు దెబ్బతిని కంకర తేలడంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పస్తాల నుంచి గుండెపురి, లక్ష్మాపురం నుంచి కాశీతండా ప్రధాన రహదారి గుండా ప్రజలు నిత్యం వివిధ అవసరాలకు సూర్యాపేట, తిరుమలగిరి, తుంగతుర్తి, నాగారం తదితర గ్రామాలకు వెళుతుంటారు. లక్ష్మాపురం-కాశీతండాల మధ్య బస్సు సౌకర్యం లేకపోగా, పస్తాల, గుండెపురి గ్రామాల మీదుగా కేవలం ఉదయం ఒక బస్సు, సాయంత్రం ఒక బస్సు మాత్రమే వెళుతుంది. దీంతో ప్రయాణికులు నిత్యం ద్విచక్రవాహనాలు, ఆటోల్లోనే ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. రోడ్డు పూర్తిగా కంకర తేలి, అడుగడుగునా గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

కల్వర్టు వద్ద నిత్యం ప్రమాదాలు

పస్తాల స్టేజీ నుంచి గ్రామానికి సమీపంలో ఉన్న కల్వర్టు నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారుతుంది. కల్వర్టుకు ఇరువైపులా ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకర తేలి ఉంది. ఈ రోడ్డుపై వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి పస్తాల, గుండెపురి మధ్య నూతన రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి



"కాశీతండా నుంచి లక్ష్మాపురం, పస్తాల నుంచి గుండెపురి వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిని గతుకుల మయంగా మారింది. ఈ రహదారి గుండా ప్రజలు నిత్యం తిరుమలగిరి, నాగారం, తుంగుతుర్తికి వెళుతుంటారు. కంకర తేలిన రహదారిపై రాకపోకలు సాగించలేక వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పస్తాల నుంచి గుండెపురి వరకు తారు రోడ్డు నిర్మించాలి.

– పులుసు, శేఖర్, పస్తాల, వాహనదారుడు

రాష్ట్ర స్థాయి పాటల పోటీల కరపత్రాల విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న నిర్వాహకులు

సూర్యాపేట : పట్టణంలోని బాల భవన్ ప్రాంగణంలో శ్రీజ్ఞాన సరస్వతి సాంస్కృతిక కళావేదిక ఆధ్వర్యంలో అమర గాయకుడు పద్మశ్రీ ఘంటసాల 102వ జయంతిని పురస్కరించుకొని డిసెంబర్ 1న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్షుడు జూనియర్ ఘంటసాల బుర్రి వెంకటేశ్వర్లు, సామాజికవేత్త ప్రధాన కార్యదర్శి గుండా రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలో పాటల పోటీల కరపత్రాలను మనం వికాస వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్, వేదిక నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు డిసెంబర్ 4న ఘంటసాల జయంతి సభావేదిక కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు పురస్కారాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రసాద్ మృతి పార్టీకి తీరనిలోటు



ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : పోటు ప్రసాద్ మృతి పార్టీకి తీరనిలోటని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పోటు ప్రసాదు కీలకంగా పనిచేశారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో జరిగిన విద్యుత్ ఉద్యమ పోరాటంలో పోలీసులను ఎదుర్కొని అరెస్టయ్యారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్, మండవ వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, పట్టణ నాయకులు పెండ్ర కృష్ణ, పెండ్ర నవీన్, రెడిమల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బస్ డిపో ఏర్పాటు చేయాలని దీక్ష



దీక్ష చేస్తున్న బస్ డిపో సాధన సమితి సభ్యులు

తిరుమలగిరి : మండల కేంద్రంలో బస్‌డిపో ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం స్థానికంగా బస్ డిపో సాధన సమితి ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో బస్ డిపో సాధన కోసం పోరాటం చేస్తామని హెచ్చరించారు. తిరుమలగిరిలో బస్ డిపో ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతం అభివృద్ధికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కందుకూరి ప్రవీణ్, కందుకూరి సోమయ్య, కొత్తగట్టు మల్లయ్య, కడెం లింగయ్య, సీహెచ్.హన్మంతు, ఎం.యాదయ్య, కె.రమేష్, కె.సోమయ్య, జి.రమేష్, పాషా, ఏల్పుల లింగయ్య, ప్రకాష్, రవి, కిరణ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. నాయకులు చేపట్టిన దీక్షను గాయకుడు ఏపూరి సోమన్న నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.

కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



నాగారం : కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

నాగారం : ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ వి.బ్రహ్మయ్య ఐకేపీ నిర్వాహకులను హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని పస్తాల, ఫణిగిరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలని సూచించారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. రైతులు 17శాతంలోపు తేమ ఉన్న ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాలకు తెచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కాంటాలు వేసి ట్యాబ్‌లలో నమోదు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వెయ్యి క్వింటాళ్ల సన్నధాన్యం కొనుగోలు

అర్వపల్లి : మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు వెయ్యి క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఏపీఎం వలిశెట్టి మల్లేష్ తెలిపారు. బుధవారం సన్నధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి ధాన్యాన్ని శుభ్రం చేయించారు. ఆయన వెంట సంఘబంధం అధ్యక్షురాలు మేకల సునీత, వీఓఏ కృష్ణకుమారి, నిర్వాహకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మండల వైద్యాధికారిణి అమూల్య

మద్దిరాల : ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి అమూల్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని మామిండ్లమడవ గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో గ్రామంలో చలిజ్వరాలు ప్రభలే అవకాశం ఉన్నందున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదే విధంగా క్షయ వ్యాధిపై అవగహన కల్పించారు. చలితీవ్రత కారణంగా అనేక సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున్న జాగ్రత్తపడాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నిఖిల, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

హరితహారం పనులను ముమ్మరం చేయాలి



మద్దిరాల : నర్సరీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి



అర్వపల్లి : వననర్సరీలో మట్టిని శుభ్రం చేసే పనులను పరిశీలిస్తున్న ఎంపీఓ గోపి

అర్వపల్లి : హరితహారం పనులను ముమ్మరం చేయాలని మండల పంచాయతీ అధికారి టి.గోపి అన్నారు. బుధవారం మండల పరిధిలోని తిమ్మాపురం వననర్సరీని ఆయన పరిశీలించి మట్టిని జల్లెడపట్టి శుభ్రంచేసి సంచుల్లో నింపాలని సూచించారు. మొక్కలు రాగానే సంచుల్లో నాటాలని ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి డి.నవీన్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ యాదమ్మ, ఫీల్డ్‌అసిస్టెంట్ బి.లింగయ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నర్సరీ పనుల పరిశీలన

మద్దిరాల : మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వన నర్సరీని బుధవారం ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. నర్సరీలో ఉపాధి కూలీలు మట్టిని బ్యాగుల్లో నింపే విధానాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట ఏపీఓ గుండు వెంకన్న, పంచాయతీ కార్యదర్శి తేజశ్రీ, ఫీల్డ్‌అసిస్టెంట్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్‌కు సన్మానం

నూతనకల్ : తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన తీగల గిరిధర్‌రెడ్డిని యువజన కాంగ్రెస్ మండల నాయకులు బుధవారం మండల కేంద్రంలో సన్మానించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు పసుల అశోక్‌యాదవ్, బంటు క్రాంతి, నెల్లుట్ల మహేష్, ఏర్పుగొండ సురేష్, కొంగల నరేష్ యాదవ్, ఉప్పుల లింగరాజు, ములకలపల్లి గణేష్, మందా సైదులు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



గిరిధర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

రైతు పండుగను జయప్రదం చేయాలి

మునగాల : మహబూబ్‌నగర్‌లో ఈనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించబోయే రైతు పండుగకు జిల్లా నుంచి రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బచ్చు అశోక్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక నిధులు కేటాయిస్తుందని తెలిపారు. ఈ సదస్సులో వ్యవసాయ రంగంలో ఆధునిక మార్పులు, ఆదర్శ రైతుల ప్రసంగాలు ఉంటాయన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మాతంగి బసవయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, కొప్పుల జైపాల్‌రెడ్డి, ఎలక నరేందర్ రెడ్డి, కోటేశ్వరరావు, వీరబాబు, కాసర్ల శ్రీనివాస్, శ్రీపాల్‌రెడ్డి, నరసింహారావు, నాగరాజు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



భానుపురి (సూర్యాపేట) : నల్లాలబావి సెంటర్‌లో బెలూన్లను ఎగురవేస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలో ఈనెల 29, 30, డిసెంబర్ 1వతేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం పట్టణంలోని నల్లాలబావి సెంటర్‌లో ఎర్ర బెలూన్లను ఎగురవేసి మహాసభల ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈసభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు వేల్పుల వెంకన్న, జిల్లేపల్లి నరసింహారావు, ధనియాకుల శ్రీకాంత్, మేకనబోయిన శేఖర్, చిన్నపంగా నరసయ్య, వన్‌టౌన్ కార్యదర్శి వల్లపుదాసు సాయికుమార్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చివ్వెంల : సూర్యాపేటలోని గాంధీ పార్కులో ఈనెల 29న జరిగే సీపీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట గోపి పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో సభను జయప్రదం చేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నవంబర 29నుంచి డిసెంబర్ 1వరకు సభలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో పిండిగ నాగమణి, ఉయ్యాల నగేష్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రాములమ్మ పాల్గొన్నారు.

అర్వపల్లి : సూర్యాపేటలో ఈనెల 29నుంచి జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్ కోరారు. బుధవారం మండలంలోని కాసర్లపహాడ్ గ్రామంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. మహాసభలలో భాగంగా ఈనెల 29న నిర్వహించే బహిరంగసభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అబ్బులు, మచ్చ నర్సయ్య, పిట్టల వెంకన్న, కె.సత్తయ్య, బి.మల్లయ్య, గంగయ్య, కళమ్మ, బోడమ్మ తదితరులు పాల్గొన్నారు.



చివ్వెంల : కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నూతనకల్ : సూర్యాపేట పట్టణంలో ఈనెల 29, 30, డిసెంబర్ 1తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్తయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలో భాగంగా ఈనెల 29న నిర్వహించే పార్టీ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు పులసరి వెంకటముత్యం, బత్తుల రవి, నర్సిరెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



కార్మికులతో మాట్లాడుతున్న రణపంగ కృష్ణ

పెన్‌పహాడ్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీ, రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులకు సరిపడా కూలి లేక ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందక రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. సన్నధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఆయన వెంట హమాలీ సంఘం నాయకులు జోసఫ్, రాజ్యు, తేజ, వరుణ్, జన్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం రాష్ట్రీయ బాల స్వస్థీయ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కె) ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కె వైద్యులు స్పందన, గౌతం పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తద్వారా వ్యాధులు సోకుండా నివారించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించి, విద్యార్థుల ఎత్తు, బరువును పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఏ కె.గీత, ఫార్మసిస్ట్ సతీష్, హెచ్‌ఎం మూల మంజుల, ఉపాధ్యాయులు గుండెటి లక్ష్మణ్‌రావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

తుంగతుర్తి : సూర్యాపేట పట్టణంలో ఈనెల 29న బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మాజీ సీఎం కేసీఆర్ చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ఆనాటి సమైక్య పాలకుల ద్వంద నీతితో తెలంగాణ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని, తెలంగాణ వెనుకబాటుకు గురైన పరిస్థితులను చూసిన కేసీఆర్ అహింస పద్ధతిలో చేస్తున్న పోరాటంలో భాగంగా 2009నవంబర్ 29న ప్రాణ త్యాగానికి సిద్ధమై ఆమరణ నిరాహార దీక్ష ప్రాంభించారని, కేసీఆర్ సచ్చుడో... తెలంగాణ వచ్చుడో అని నినదించిన రోజే మన తెలంగాణ దీక్షా దివస్ కార్యక్రమం అని అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న దీక్షా దివస్‌కు ప్రజలు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, గుండగాని దుర్గయ్య, గుడిపాటి వీరయ్య, మల్యాల రాములు, లకావత్ యాకునాయక్, గుగులోతు ఈరోజీ, గోపగాని శ్రీనివాస్, గోపగాని వెంకన్న, గాజుల సోమయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

త్వరలోనే పీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభిస్తాం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం



మునగాలలో పాత సివిల్ ఆసుపత్రి కూల్చివేత పనులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

మునగాల : మండల కేంద్రంలో రూ.1.55కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవనాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్టు జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ కోటాచలం తెలిపారు. బుధవారం ఆయన మునగాల పీహెచ్‌సీ ఆవరణలో ఉన్న పాత సివిల్ ఆసుపత్రి భవనం కూల్చివేత పనులను పరిశీలించి మాట్లాడారు. నూతన భవన నిర్మాణ పనులు పూర్తయి ప్రాంభానికి సిద్ధంగా ఉన్నప్పటికీ పాత భవనం అడ్డుగా ఉన్నందున దాన్ని కూల్చివేస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట పీహెచ్‌సీ మండల వైద్యాధికారి డాక్టర్ పి.రవీందర్ ఉన్నారు.

చెవిటి వెంకన్నయాదవ్‌కు సన్మానం



వెంకన్నయాదవ్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్

మద్దిరాల : మండలంలోని కుక్కడం ఆవాస గ్రామం లాక్యతండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు బానోతు శ్రీనివాస్‌ను తుంగతుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎంపిక చేయడం పట్ల బుధవారం పార్టీ డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తనను ఎంపిక చేయడం పట్ల శాలువాతో సన్మానించారు. తన ఎంపికకు సహకరించిన మంత్రి కోటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి, ఎమ్మెల్యే మందుల సామేల్‌కు, రైతు కమిషన్ సభ్యుడు వెంకన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలుమల్లు యాదవ్, బానోతు మాన్‌సింగ్, మద్దెల భిక్షపతి, మల్లయ్య, హేమ, నరేష్ తదితరులు ఉన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న కోదాడ జేఏసీ, ఉద్యమకారులు

కోదాడరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని జేఏసీ కన్వీనర్ రాయపూడి చిన్ని, ఉద్యమకారుడు రాయపుడి వెంకటనారాయణ కోరారు. ఈమేరకు సూర్యాపేట నుంచి భద్రాచలం వరకు పాదయాత్ర చేస్తున్న ఉద్యమకారులకు బుధవారం కోదాడలో వారు స్వాగతం పలికి మాట్లాడారు. ఉద్యమ నేపథ్యాన్ని వివరిస్తూ స్థానిక ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పిస్తూ పాదయాత్ర చేయడం అభినందనీయమన్నారు. ఉద్యమకారులకు పింఛన్, 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మలిదశ ఉద్యమకారులు ఉదయగిరి, కన్నెగంటి నరసింహారావు, రమేష్, పాదయాత్ర నిర్వాహకులు అంజిరెడ్డి, అమృతనాయక్, గోపి, సోమయ్య, గంగయ్య, వెంకన్న, రహమాన్‌అలీ ఉన్నారు.

శివాలయానికి తాళం బహూకరణ

తిరుమలగిరి : మండల కేంద్రంలోని శివాలయానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు ఊర భిక్షమయ్య పుష్ప దంపతులు బుధవారం రాజమేళ తాళాన్ని బహూకరించారు. అనంతరం వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శివస్వాములు నాతి వీరమల్లు, నాగాచారి, జంపాల సత్తయ్య, తాటి ప్రసాద్, నోముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.